సాక్షి
మెదక్
బుధవారం, 17 ఏప్రిల్ 2024


సభలో పాల్గొన్న జనం

మెతుకుసీమకు మొక్కుతున్నా..

ఎన్ని జన్మలెత్తినా ఈ గడ్డ రుణం తీర్చుకోలేను : బీఆర్ఎస్ అధినేత కేసీఆర్

- సంగమేశ్వర, బసవేశ్వర ఎత్తిపోతలను పండబెట్టిన కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలి
- లిల్లీపుట్ ప్రభుత్వం మెదక్‌కు సింగూరు నీళ్లివ్వలేదు
- సుల్తాన్‌పూర్‌లో బీఆర్ఎస్ బహిరంగసభ

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: మెదక్ జిల్లాను సస్యశ్యామలం చేసేందుకు చేపట్టిన సంగమేశ్వర, బసవేశ్వర ఎత్తిపోతల పథకాలను కోల్డ్ స్టోరేజీలో పెట్టిన కాంగ్రెస్ ప్రభుత్వానికి ఈ ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని బీఆర్ఎస్ అధినేత కె.చంద్రశేఖర్‌రావు విజ్ఞప్తి చేశారు. మల్లన్నసాగర్ నుంచి సింగూరుకు నీటిని తెచ్చి నిర్మించతలపెట్టిన ఈ రెండు ఎత్తిపోతల పథకాలను కాంగ్రెస్ ఎందుకు ఎండబెట్టాలని చూస్తుందో ప్రజలు ఆలోచన చేయాలని విజ్ఞప్తి చేశారు. జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని చౌటకూరు మండలం సుల్తాన్‌పూర్ శివారులో మంగళవారం నిర్వహించిన ప్రజాఆశీర్వాద సభలో కేసీఆర్ ప్రసంగించారు. కాళేశ్వరం జలాలు రావాలన్నా.. సంగమేశ్వర, బసవేశ్వర ఎత్తిపోతల పథకాలు పూర్తి కావాలన్నా.. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు తగిన బుద్ధి చెప్పాలన్నారు. గతంలో అధికారంలో లిల్లీపుట్ కాంగ్రెస్ ప్రభుత్వం సింగూరు ప్రాజెక్టు నీటిని హైదరాబాద్‌కు తరలించి, మెదక్, నిజామాబాద్ జిల్లాలకు చుక్కనీరు ఇవ్వలేదని మండిపడ్డారు. సింగూరు జలాల కోసం ఎన్ని ధర్నాలు, ఆందోళనలు చేసినా పట్టించుకోలేదని విమర్శించారు.

మెతుకుసీమ రుణం తీర్చుకోలేను

రాజకీయంగా తాను ఎంతో ఎత్తుకు ఎదగడానికి, తెలంగాణ రాష్ట్రాన్ని సాధించేందుకు ఈ మెదక్ జిల్లా తనకు బలమిచ్చిందని, ఈ మెతుకు సీమకు రెండు చేతులెత్తి మొక్కుతున్నానని కేసీఆర్ భావోద్వేగంతో అన్నారు. ఈ జిల్లా ప్రజల ఆశీర్వాదం లేకపోతే తనకు ఈ స్థాయి వచ్చేదే కాదన్నారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో హరీశ్‌రావు నాయకత్వంలో ఏడు ఎమ్మెల్యే స్థానాలను సాధించిందని గుర్తు చేశారు. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను గెలిపిస్తేనే తెలంగాణ హక్కుల సాధన సాధ్యమవుతుందని చెప్పారు. ఎన్ని జన్మలెత్తినా మెతుకు సీమ రుణం తీర్చుకోలేనన్నారు. తెలివి ఉన్నోడు, లేనోడు బీఆర్ఎస్‌కు ఇప్పుడు ఓట్లేందుకు.. సీట్లేందుకు అని అంటున్నారని, ఇప్పుడే బీఆర్ఎస్‌కు ఓట్లు, సీట్లు కావాలని కోరారు. తనను ఆనాడు గెలిపించకపోతే తెలంగాణ వచ్చేది కాదన్నారు. పాలిచ్చే బర్రెను వదిలేసి.. దున్నపోతుకు గడ్డేస్తే ప్రయోజనం ఉండదని, ఇచ్చిన హామీలను నెరవేర్చని కాంగ్రెస్‌కు ఓటేస్తే ఇలాగే ఉంటుందని అన్నారు.

వెంకట్రామిరెడ్డి, అనిల్‌ను ఆశీర్వదించండి

ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ తరఫున మంచి అభ్యర్థులను బరిలోకి దింపామని కేసీఆర్ అన్నారు. తెలంగాణ కోసం కొట్లాడిన తెలంగాణ ఉద్యమకారుడు గాలి అనిల్‌కుమార్‌ను, మెదక్ నుంచి ఐఏఎస్ అధికారి వెంకట్రాంరెడ్డిని గెలిపించాలని కేసీఆర్ విజ్ఞప్తి చేశారు. ప్రజలను ఆదుకునే మంచి వ్యక్తులని, ప్రజాస్వామ్యంలో ప్రజలు ఆలోచించి ఓట్లేయాలని కోరారు.


బీఆర్ఎస్ అభ్యర్థులతో కేసీఆర్

అబద్ధాలతో రేవంత్ పాలన :హరీశ్



సంగారెడ్డి : అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలైతే కాంగ్రెస్‌కు ఓటెయ్యాలని.. లేదంటే కారు గుర్తు ఓటేసి గెలిపించాలని సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ కోరారు. అధికారంలోకి వచ్చి నాలుగు నెలలైనా ఒక్కటీ పూర్తిస్థాయిలో అమలు చేయలేదని మండిపడ్డారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీకి బుద్ధి చెప్తేనే హామీల అమలుకు కొట్లాడే అవకాశం ఉంటుందని తెలిపారు. కాంగ్రెస్ చాలాచోట్ల డమ్మీ అభ్యర్థులను పెట్టి బీజేపీకి మద్దతు ఇస్తుందని ఆరోపించారు. ఆస్పత్రుల్లో కేసీఆర్ కిట్ బంద్ చేశారని, 24 గంటల కరెంటు నుంచి 12 గంటలకు తగ్గించారని పేర్కొన్నారు. తాగునీటి కష్టాలు పెరిగిపోయాయని చెప్పారు. రేవంత్ అబద్ధాలతోనే పరిపాలన సాగిస్తున్నారని ఆరోపించారు. కేంద్రంలో బీజేపీ పదేళ్ల పాలనలో ఒక్క మంచి కార్యక్రమమైనా చేసిందా అని ప్రశ్నించారు. దేశంలో 150 మెడికల్ కాలేజీలు ఉంటే ఒక్కటైనా తెలంగాణకు ఇచ్చారా అని నిలదీశారు. విదేశాల్లో నుంచి నల్ల ధనం తెచ్చి పంచుతామన్నారు.. 20 కోట్ల ఉద్యోగాలు ఇస్తామని అబద్ధాలు చెప్పారన్నారు. గ్యాస్, పెట్రోల్ డీజిల్ ధరలు పెంచిందన్నారు. మతాలతో బీజేపీ పాలన సాగిస్తుందని దుయ్యబట్టారు. ప్రజల బాధలు తెలిసిన వ్యక్తి వెంకట్రామిరెడ్డిని తానే ఒప్పించి బరిలో ఉంచానని చెప్పారు. గాలి అనిల్‌కుమార్ ఉద్యమకారుడు అని.. వీళ్లిద్దరినీ గెలిపిస్తే ప్రజలకు సేవ చేస్తారని పేర్కొన్నారు.

అమలు కాని హామీలతో మోసం

- మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి



వట్‌పల్లి(అందోల్): అమలు కాని హామీలు ఇచ్చి కాంగ్రెస్ పార్టీ ప్రజలను మోసం చేసిందని మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి ఆరోపించారు. బడుగు బలహీన వర్గాలను కడుపులో పెట్టుకొని కాపాడుకున్న తొలి సీఎం కేసీఆర్ అని కొనియాడారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ఓడించేందుకు ప్రజలు ఎదురుచూస్తున్నారన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 70 లక్షల మంది రైతులకు, 50 లక్షల ఎకరాలకు రైతుబంధు ఇచ్చామన్నారు. కాంగ్రెస్ హామీలకు ఏడాదికి రూ.3 లక్షల కోట్లు ఎక్కడి నుంచి తెస్తారని ప్రశ్నించారు. బీఆర్ఎస్ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్‌కు ఒక్క అవకాశం ఇవ్వాలన్నారు. అమర వీరుల స్థూపం వద్ద దండ వేయకుండా తెలంగాణ ఆత్మగౌరవాన్ని సీఎం రేవంత్ అవమాన పరిచారని ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ అన్నారు. తెలంగాణ ఉద్యమం అంటే రేవంత్‌కు ద్వేషమని చెప్పారు. తెలంగాణ నుంచి చంద్రబాబును కేసీఆర్ వెళ్లేలా చేశాడని రేవంత్‌కు కోపమని.. సీఎం నరనరాల్లో బాబు ఉన్నాడన్నారు.

న్యూస్‌రీల్

తప్పుడు ఆరోపణలతో కేసులు

మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి


మాట్లాడుతున్న వెంకట్రామిరెడ్డి

చేగుంట(తూప్రాన్): బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు తనపై తప్పుడు ఆరోపణలతో ఎన్నికల కమిషన్, ఈడీ అధికారులకు ఫిర్యాదు చేయడంతో పాటు కోర్టుల్లో కేసులు వేస్తున్నారని బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. వడియారంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం చేగుంట, నార్సింగి మండలాల కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బీఆర్ఎస్ తరఫున తనను ఎంపీగా గెలిపిస్తే ఐదు నియోజకవర్గ కేంద్రాలను అభివృద్ధి చేయిస్తానని హామీఇచ్చారు. పేదలకోసం ఫంక్షన్ హాళ్లను నిర్మించి ఒక్కరూపాయికే ఇచ్చేటట్టు ఏర్పాట్లు చేస్తానని చెప్పారు. అనంతరం ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో రఘునందన్‌రావు ఓటమి ఖాయమన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలశాఖ అధ్యక్షుడు నారాయణరెడ్డి, బాబు, ఎంపీపీ సబిత, జెడ్పీటీసీలు ముదాం శ్రీనివాస్, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

రైతులను ఇబ్బందులు పెట్టొద్దు

జిల్లా వ్యవసాయాధికారి గోవింద


రైతుసేవా కేంద్రాన్ని సందర్శిస్తున్న డీఏఓ గోవింద

చిలప్‌చెడ్(నర్సాపూర్): వచ్చే సీజన్ ప్రారంభం నాటికి ఎరువుల దుకాణాల నిర్వాహకులు రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉండేలా చూడాలని జిల్లా వ్యవసాయాధికారి గోవింద సూచించారు. మంగళవారం ఆయన ఏడీఏ పుణ్యవతితో కలసి మండల కేంద్రంలోని రైతు ఆగ్రో సేవా కేంద్రం, పీఏసీఎస్ సోమక్కపేట్, ఫైజాబాద్ గ్రామంలో గల రైతు ఉత్పత్తిదారుల కేంద్రాలను సందర్శించి, రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నకిలీ ఎరువులు, విత్తనాలు అమ్మితే చర్యలు తప్పవన్నారు. అదేవిధంగా రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి బాల్‌రెడ్డి, ఏఈఓ భూపాల్, పీఏసీఎస్ సీఈఓ పోచయ్య, ఫర్టిలైజర్ నిర్వాహకులు శ్రీనివాస్, రమేశ్, నర్సింహులు, యాసిన్ తదితరులు పాల్గొన్నారు.

పరీక్షలకు ఆటంకం కల్గించడం నేరం

జూనియర్ సివిల్ జడ్జి అనిత

నర్సాపూర్: ఫీజులు చెల్లించలేదన్న నెపంతో విద్యార్థులను పరీక్షలు రాయనివ్వకుండా అడ్డుకోవడం చట్టరీత్యానేరమని జూనియర్ సివిల్ జడ్జి, మండల లీగల్ సర్వీస్ కమిటీ చైర్మన్ కె.అనిత హెచ్చరించారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ ఈ విషయమై చాలా మంది విద్యార్థుల తల్లిదండ్రులు కమిటీ దృష్టికి తీసుకువచ్చారన్నారు. దీంతో తమ కమిటీ ప్రతినిధులు న్యాయవాది స్వరూపరాణి, ఎస్‌ఐ పుష్పరాజ్ తదితరులను ఆయా పాఠశాలలకు పంపి విచారణ చేయించినట్లు చెప్పారు. ఫీజుల కోసం విద్యార్థులను క్లాసు బయట కూర్చుండ పెట్టడం, పరీక్షలకు అనుమతించబోమని హెచ్చరించడం సరికాదని ఆయా యాజమాన్యాలకు వివరించారని ఆమె తెలిపారు. విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తున్న ప్రైవేటు పాఠశాల వివరాలు ఎంఈఓకు అందజేసి తగిన చర్యలు తీసుకోవాలని సూచించినట్లు చెప్పారు. విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రతి విద్యార్థికి విద్యను పొందేహక్కు ఉంటుందని, ఫీజుల పేరుతో వారి హక్కులను హరించి చదువుకు ఆటంకం కల్గిస్తున్నట్లు ఫిర్యాదులు వస్తే ఆయా పాఠశాలలపై చట్టపరంగా చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందని జడ్జి కె.అనిత హెచ్చరించారు.

కొనుగోలు కేంద్రాల పరిశీలన


రికార్డు పరిశీలిస్తున్న జేసీ వెంకటేశ్వర్లు

రామాయంపేట(మెదక్): పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం, తొనిగండ్లలో సహకార సంఘం ఆధ్వర్యంలో కొనసాగుతున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను మంగళవారం అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి.. రైతులతో మాట్లాడారు. రైతులను ఇబ్బందులకు గురిచేయకుండా కొనుగోలు చేయాలని సూచించారు. ఆయన వెంట సహకార సంఘం సీఈవో నర్సింహులు, రైతులు ఉన్నారు.

రేపటి నుంచి నామినేషన్లు

- 18నుంచి 25 వరకు అవకాశం
- అభ్యర్థితోపాటు ఐదుగురికే అనుమతి
- అఫిడవిట్‌లో ఆస్తులు, కేసులు వెల్లడించాలి
- ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాహుల్‌రాజ్

మెదక్‌జోన్/మెదక్‌కలెక్టరేట్: రేపటి నుంచి ఈనెల 25వరకు నామినేషన్ల ప్రక్రియ కొనసాగుతుందని ప్రతిఒక్కరు ఎన్నికల నిబంధనలు పాటించాలని పార్లమెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ నామినేషన్‌లకు మెదక్ కలెక్టరేట్‌లోని సమావేశ హాల్‌లో అన్ని ఏర్పాట్లు చేసినట్టు చెప్పారు. ఉదయం 11నుంచి మధ్యాహ్నం 3వరకు పనిదినాల్లో మాత్రమే నామినేషన్లు స్వీకరించనున్నట్లు తెలిపారు. అభ్యర్థితో పాటు మొత్తం ఐదుగురు మాత్రమే రావచ్చని, వంద గజాల దూరంలోనే ర్యాలీలు, వాహనాలు నిలిపివేయాలన్నారు. అభ్యర్థులు నామినేషన్ పత్రాలతో పాటు అఫిడవిట్‌లో వారి ఆస్తులు, కేసుల గురించి వెల్లడించాలన్నారు. క్రిమినల్ కేసులు ఉన్నవారు వివరాలను 29లోపు మూడు సార్లు దినపత్రికలతో పాటు, లోకల్ ఛానల్స్‌లో విధిగా అడ్వటైజ్‌మెంట్ ఇవ్వాలని చెప్పారు. రాజకీయపార్టీల నాయకులు అధికారులకు సహకరించాలని, అభ్యర్థుల ఎన్నికల ఖర్చును ఎప్పటి కప్పుడు లెక్కలు కట్టేందుకు ప్రత్యేక నిఘాపెడతారన్నారు.

నిఘా ముమ్మరం..

నామినేషన్ల పక్రియ ప్రారంభం అయ్యాక చెక్ పోస్టుల వద్ద మరింత నిఘా ముమ్మరం చేయనున్నట్టు కలెక్టర్ చెప్పారు. కోడ్ అమల్లోకి వచ్చాక ఇప్పటి వరకు 19మంది వద్ద నుంచి మొత్తం రూ.28,89,830 సీజ్ చేయగా అందులో 11మంది సరైన డాక్యుమెంట్లు చూపించడంతో రూ. 15,21,730ల నగదును విడుదల చేశామని, మరో 8 మందికి సంబంధించి రూ.13,68,100 ఉందని.. డాక్యుమెంట్లు చూపిస్తే విడుదల చేస్తామని చెప్పారు. ఇప్పటికే ఇద్దరు అభ్యర్థులపై 4కేసులు నమోదు చేశారని, అందులో ఒక్క అభ్యర్థి ఓటర్లకు రూ.200 చొప్పున పంచుతుండగా కేసు నమోదు చేయగా, మరో అభ్యర్థిపై 3 కేసులు పెట్టామన్నారు. అలాగే కోడ్ అమల్లోకి వచ్చినప్పటి నుంచి 98,490లీటర్ల మద్యాన్ని సీజ్ చేశామని, దాని విలువ రూ.93,53,003 ఉందన్నారు.

అభ్యర్థిఖర్చు రూ.95లక్షలు

ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులు రూ.95లక్షలు మాత్రమే ఖర్చు చేయాలని కలెక్టర్ తెలిపారు. అభ్యర్థులు రూ.10వేల వరకు మాత్రమే క్యాష్‌రూపంలో ఖర్చు చేయవచ్చని అంతకన్నా ఎక్కువ ఖర్చు పెడితే చెక్‌రూపంలో లేదా ఆన్‌లైన్ ద్వారా మాత్రమే ఖర్చు చేయాలని చెప్పారు.


నామినేషన్ల ఏర్పాట్లు పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

నామినేషన్ల ప్రక్రియకు పకడ్బందీ ఏర్పాట్లు

త్వరలో జరుగనున్న పార్లమెంట్ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో పార్లమెంట్ ఎన్నికలు నిర్వహణలో భాగంగా నామినేషన్ల ప్రక్రియ నిర్వణపై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం మెదక్ ఆర్డీఓ రమాదేవి, తూప్రాన్ ఆర్డీఓ జై చంద్రారెడ్డితో కలిసి కలెక్టరేట్ ఆవరణలో క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. సమర్థవంతంగా ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచనలిచ్చారు. నామినేషన్ ప్రక్రియ ముగిసే వరకు పకడ్బందీగా బందోబస్తు ఏర్పాటు చేయాలని, వందమీటర్ల దూరం వరకు సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. నామినేషన్ల పూర్తి ప్రక్రియను సీసీ కెమెరాలు, వీడియోగ్రాఫీ మధ్య చేపట్టాలని ఆదేశించారు.

ఆరుగ్యారంటీల అమలులో విఫలం

- కార్యకర్తలు మా వెంటే..
- ఎమ్మెల్యే సునీతారెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

నర్సాపూర్: అసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలతో పాటు 420 హామీల అమలులో విఫలం చెందిందని ఎమ్మెల్యే సునీతారెడ్డి ఆరోపించారు. ఆమె మంగళవారం మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డితోపాటు పలువురు నాయకులు బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరినప్పటికీ కార్యకర్తలంతా తమ వెంటే ఉన్నారన్నారు. కొందరు వారి స్వార్థం కోసం కాంగ్రెస్‌లోకి వెళ్లారని ఆరోపించారు. ఈ పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి విజయం కోసం కష్టపడి పని చేసేందుకు కార్యకర్తలంతా సిద్ధంగా ఉన్నారని చెప్పారు. కాంగ్రెస్ నాయకులు డిసెంబరులో రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చి ఇప్పుడు ఆగస్టులో చేస్తామని చెప్పడం రైతులను మోసం చేయడమేనని ఆరోపించారు. సమావేశంలో చంద్రాగౌడ్, శేఖర్, సత్యంగౌడ్, సూరారం నర్సింహులు, గోవర్ధన్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, శ్రీశైలం, విఠల్, మహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

చెక్‌పోస్టులు పెంచుతాం

ఎస్పీ బాలస్వామి


కారును తనిఖీ చేస్తున్న ఎస్పీ బాలస్వామి

పెద్దశంకరంపేట(మెదక్): ఎన్నికల కోడ్ నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా మరిన్ని చెక్‌పోస్టులను ఏర్పాటు చేయనున్నట్లు జిల్లా ఎస్పీ బాలస్వామి చెప్పారు. మంగళవారం రాత్రి పెద్దశంకరంపేట మండలం కోళపల్లి 161వ జాతీయ ప్రధాన రహదారి పాత టోల్‌ప్లాజా వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును ఆయన తనిఖీ చేశారు. అనంతరం మాట్లాడుతూ జిల్లాలో అదనంగా మూడు చెక్‌పోస్టులను ఏర్పాటు చేస్తామని, ఇప్పటి వరకు 7చెక్‌పోస్టులుండగా 10కి పెంచుతామన్నారు. డీఎస్పీ డాక్టర్ రాజేశ్, అల్లాదుర్గం సీఐ రేణుకారెడ్డి, ఎస్‌ఐ శంకర్ తదితరులున్నారు.

కొనుగోలులో జాప్యం చేయొద్దు

అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

సాక్షి ఎఫెక్ట్

నర్సాపూర్: రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తెచ్చిన వడ్లు తేమశాతం 16కు రాగానే వాటిని తూకం వేసి కొనుగోలు చేయడంలో జాప్యం చేయొద్దని జిల్లా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు ఆదేశించారు. మంగళవారం సాక్షిలో వచ్చిన కొను 'గోడు' కథనానికి ఆయన స్పందించి నర్సాపూర్‌లోని కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. వడ్లలో తేమ శాతం చూడాలని సిబ్బందికి ఆదేశించి తేమ శాతం 16వస్తే వెంటనే వడ్లను తూకం వేయాలని పీఏసీఎస్ సీఈఓ వెంకటస్వామిని ఆదేశించారు. తేమ ఎక్కువగా వడ్లను బాగా ఆరబెట్టాలని ఆయన రైతులకు సూచించారు. అనంతరం మండలంలోని చిప్పల్‌తుర్తిలోని కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి అక్కడి సిబ్బందికి సూచనలిచ్చారు. ఆయన వెంట స్థానిక ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.


పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

నీటి ఎద్దడిపై స్పందించరా?

- 'భగీరథ' అధికారులపై సభ్యులు ఆగ్రహం
- వాడీవేడిగా జెడ్పీ సమావేశం

మెదక్ కలెక్టరేట్: అధికారుల నిర్లక్ష్యంతో వారం రోజులుగా టేక్మాల్ మండలం కుసంగి గ్రామానికి మిషన్ భగీరథ నీళ్ల రాక ప్రజలు అల్లాడిపోతున్నారని, పనిచేయని అధికారులపై చర్యలు తీసుకొని తాగునీటి సమస్య పరిష్కరించాలని టేక్మాల్ కోఆప్షన్ సభ్యుడు సర్దార్ డిమాండ్ చేశారు. జెడ్పీచైర్ పర్సన్ హేమలత అధ్యక్షతన మంగళవారం కలెక్టరేట్‌లోని ప్రజావాణి హాల్‌లో జిల్లా ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా టేక్మాల్ కో ఆప్షన్ సభ్యుడు యూసుఫ్ మాట్లాడుతూ మండుతున్న ఎండలతో ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడుతుంటే స్పందించని అధికారులు ఎందుకని ఆగ్రహం వ్యక్తం చేశారు. అదే విధంగా బ్యాంకుల అధికారులు వృద్ధుల పెన్షన్ ఇవ్వకుండా బాకీలలో జమ చేసుకుంటున్నారని, దీంతో వృద్ధులు అనేక అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జెడ్పీ చైర్ పర్సన్ హేమలత, ఎమ్మెల్సీ శేరి సుభాస్‌రెడ్డి స్పందించి తక్షణమే తాగునీటి సమస్య పరిష్కరించాలని లేకుంటే కఠిన చర్యలు ఉంటాయని సంబంధిత అధికారులను హెచ్చరించారు. అనంతరం పొద్దు తిరుగుడు కొనుగోలు కేంద్రాలు లేక రైతులు అనేక అవస్థలు పడుతున్నారని, వెంటనే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని నిజాంపేట జెడ్పీటీసీ పంజావిజయ్‌కుమార్ సభ దృష్టికి తీసుకొచ్చారు. వ్యవసాయశాఖ అధికారి గోవింద్ స్పందించి త్వరలోనే కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.



సమస్యలపై అధికారులను ప్రశ్నిస్తున్న సభ్యులు

ఉచిత విద్యుత్ బిల్లులు రావడం లేదు

అర్హులందరికీ ఉచిత విద్యుత్ బిల్లులు రావడం లేదని నిజాంపేట ఎంపీపీ సిద్దిరాములు విద్యుత్ అధికారులను ప్రశ్నించారు. గొల్లకుర్మలు డీడీలు కట్టి ఏడాది అవుతున్నా గొర్రెలు ఇవ్వక పోవడం దారుణమని సభ్యులు వెటర్నరీ అధికారి వెంకటయ్యను నిలదీశారు. అలాగే పారిశుద్ధ్య కార్మికులకు జీతాలు కోసం తమను నిలదీస్తున్నారని వెంటనే వారికి జీతాలు ఇప్పించాలని డీపీఓను కోరారు. కోరం లేకపోవడంతో జెడ్పీ సమావేశం రెండు గంటలు ఆలస్యంగా ప్రారంభమైంది. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ రమేశ్, ఎమ్మెల్సీలు యాదవ రెడ్డి, సుభాస్‌రెడ్డి, జెడ్పీ సీఈఓ ఎల్లయ్య, జెడ్పీటీసీలు, ఎంపీపీలు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ సమన్వయకర్తలు వీరే..

సాక్షి, సిద్దిపేట: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా బీఆర్ఎస్ సమన్వయకర్తలను ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నియమించారు. మెదక్ పార్లమెంట్ పరిధిలోని సంగారెడ్డికి ఎంఐడీసీ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, పటాన్‌చెరుకు మాజీ ఎమ్మెల్సీ భూపాల్ రెడ్డి, నర్సాపూర్‌కు ఎమ్మెల్సీ యాదవ రెడ్డి, మెదక్‌కు డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డిని నియమించారు. అలాగే దుబ్బాకకు మనోహర్‌రావు, గజ్వేల్‌కు జెడ్పీ చైర్‌పర్సన్ రోజా శర్మ, సిద్దిపేటకు ఫారూఖ్ హుస్సేన్‌లు నియమితులయ్యారు. జహీరాబాద్‌కు దేవిశ్రీప్రసాద్ రావు, అందోల్‌కు డీసీసీబీ వైస్ చైర్మన్ పట్నం మాణిక్యం, నారాయణఖేడ్‌కు మఠం భిక్షపతి, కామారెడ్డికి మాజీ ఎమ్మెల్యే జనార్దన్ గౌడ్, ఎల్లారెడ్డికి తిరుమల్ రెడ్డి, బాన్సువాడ జెడ్పీ చైర్మన్ దఫేదర్ రాజు, జుక్కల్‌కు మాజీ డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి ఉన్నారు.

క్లుప్తంగా

నగదు పట్టివేత



నగదు స్వాధీనం చేసుకొని రశీదు ఇస్తున్న పోలీసులు

పెద్దశంకరంపేట(మెదక్): మండల పరిధిలోని కోళాపల్లి పాత టోల్‌గేట్ (చెక్‌పోస్ట్) వద్ద వాహనాల తనిఖీల్లో పోలీసులు నగదు పట్టుకున్నారు. మహారాష్ట్ర వాసి షేక్ సమీర్ వద్ద రూ.2 లక్షలు, మహారాష్ట్ర నుంచి హైదరాబాద్ వెళ్తున్న మరో వాహనంలో గౌరవ్ ప్రకాష్ నుంచి రూ.98,400లను స్వాధీనం చేసుకున్నారు. ఎన్నికల నేపథ్యంలో రూ.50 వేల కంటే ఎక్కువగా నగదు తీసుకెళ్లవద్దని ఎస్ఐ శంకర్ తెలిపారు. పట్టుబడిన నగదును సంగారెడ్డిలోని గ్రీవెన్స్ కమిటీలో డిపాజిట్ చేశారు.

ఇసుక డంప్‌లపై దాడులు

బెజ్జంకి(సిద్దిపేట): ఇసుక డంప్‌లపై మంగళవారం సిద్దిపేట టాస్క్‌ఫోర్స్, బెజ్జంకి పోలీసులు దాడులు చేశారు. మండలంలోని గాగిళ్లాపూర్ శివారులో అక్రమంగా నిల్వ ఉన్న 200 టన్నుల ఇసుకను సీజ్ చేశారు. విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. అక్రమ నిల్వలపై పోలీసులకు సమాచారం ఇవ్వాలని ప్రజలను ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.

యువతి అదృశ్యం



సుమలత

టేక్మాల్(మెదక్): యువతి అదృశ్యమైన సంఘటన మండల పరిధిలోని తంపులూర్‌లో జరిగింది. ఎస్ఐ మురళి కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన నాయికోటి సాయిలు తన భార్య, చిన్నకుమార్తెతో కలిసి గ్రామంలోని దుర్గమ్మ ఆలయం వద్ద నిర్వహిస్తున్న నాటకం చూడటానికి సోమవారం రాత్రి వెళ్లారు. తిరిగొచ్చి ఇంట్లో చూస్తే పెద్ద కుమార్తె సుమలత కనిపించడం లేదు. ఆమె సెల్‌కు కాల్ చేస్తే స్విచ్ఛాఫ్ అని వచ్చింది. దీంతో తెలిసిన వారి ఇళ్లతోపాటు బంధువుల వద్ద వెతికినా ఆచూకీ తెలియరాలేదు. దీంతో మంగళవారం తండ్రి నాయికోటి సాయిలు.. పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని వారు దర్యాప్తు చేస్తున్నారు.

జాబ్ పేరిట మోసం

సిద్దిపేటకమాన్: పార్ట్ టైం జాబ్ పేరిట వ్యక్తి మోసపోయాడు. ఈ సంఘటన వర్గల్ మండలంలో జరిగింది. మండలానికి చెందిన ఓ వ్యక్తికి సైబర్ నేరస్తుడు హాయ్ అని ముందుగా మెసేజ్ పెట్టి ఆ తర్వాత ఫోన్ చేశాడు. పార్ట్ టైం జాబ్ ఉందని ఫైవ్ స్టార్ హోటల్‌కు రేటింగ్ ఇవ్వాలని చెప్పగా బాధితుడు ఒప్పుకున్నాడు. అనంతరం సామాజిక మాధ్యమంలో లింక్ పంపించాడు. అందులో పెట్టుబడి పెడితే ఎక్కువ మొత్తంలో డబ్బులు వస్తాయని చెప్పగా ఆశపడిన బాధితుడు రెండు, మూడు సార్లు పెట్టుబడి పెట్టగా లాభం వచ్చింది. దీంతో నమ్మకం కుదిరిన బాధితుడు విడతల వారీగా రూ. 3,01,500 పెట్టుబడి పెట్టాడు. ఆ తర్వాత లింక్ ఓపెన్ చేసి చూడగా బ్లాక్ చేసి ఉండటంతో 1930కు కాల్ చేసి ఫిర్యాదు చేశాడు. సిబ్బంది వెంటనే రూ. 88 వేలు ఫ్రీజ్ చేశారు.

మరో ఘటనలో...

ఐబీఎం కంపెనీలో బ్యాక్ డోర్ కింద చేరే అవకాశం ఉందని సిద్దిపేట పట్టణానికి చెందిన బాధితుడిని నమ్మించి సైబర్ నేరగాడు రూ.1,33,500 కాజేశాడు. తర్వాత స్విచ్ ఆఫ్ చేశాడు. దీంతో మోసపోయినట్టు గుర్తించిన 1930కు ఫిర్యాదు చేశాడు.



కేసీఆర్‌తో హరీశ్ మాటామంతి



సభావేదికపై ఆసీనులైన బీఆర్ఎస్ నేతలు

గులాబీ శ్రేణుల్లో జోష్



నేను విజిల్ వేస్తే..

సాక్షిప్రతినిధి సంగారెడ్డి: లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా జహీరాబాద్ లోకసభ స్థానం పరిధిలో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభ గులాబీ పార్టీ శ్రేణుల్లో జోష్ నింపింది. మండే ఎండలను సైతం లెక్కచేయకుండా భారీగా ఈ సభకు ఆందోల్, సంగారెడ్డి, నారాయణఖేడ్, జహీరాబాద్, పటాన్‌చెరు, నర్సాపూర్ తదితర నియోజకవర్గాల నుంచి పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులు, జనాలు తరలివచ్చారు. సాయంత్రం 6.45 ప్రాంతంలో సభాస్థలానికి చేరుకున్నా కేసీఆర్.. సుమారు 40 నిమిషాల పాటు ప్రసంగించారు. ప్రధానంగా కాంగ్రెస్ ప్రభుత్వం తీరుపై విమర్శల దాడి చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో రేవంత్ సర్కారు విఫలమైందని తనదైన శైలిలో విమర్శనాస్త్రాలు సంధించారు. లిల్లీపుట్ ప్రభుత్వం ఏడాదిలో కూలిపోతుందంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ సాధించిన మాదిరిగానే తిరిగి తెలంగాణలో బీఆర్ఎస్ సర్కారును తెస్తానని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాజీ హోం మంత్రి మహమూద్అలీ, ఎమ్మెల్యేలు చింతాప్రభాకర్, గూడెం మహిపాల్‌రెడ్డి, కొత్త ప్రభాకర్‌రెడ్డి, సునీతారెడ్డి, మాణిక్‌రావు, ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్యేలు, పార్టీ ముఖ్యనాయకులు పాల్గొన్నారు.



సభకు హాజరైన వృద్ధులు



ఏర్పాటు చేసిన భారీ ఫ్లెక్సీ



యువకుడి ఉత్సాహం

మతతత్వ రాజకీయాలకు తావు లేదు: చాడ



సమావేశంలో మాట్లాడుతున్న వెంకట్‌రెడ్డి

సిద్దిపేటఅర్బన్: ప్రధాని మోదీ చేస్తున్న భావోద్వేగ మత రాజకీయాలను ఓడిద్దామని, దేశ సమగ్రత, ఆర్థిక విధానాలను నాశనం చేయడమే బీజేపీ ఎజెండా అని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. మంగళవారం సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ఎడ్ల గురువారెడ్డి భవన్‌లో జిల్లా కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ సంపదను, వనరులను కార్పొరేట్లకు అప్పనంగా దోచిపెడుతున్న ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్‌షాల దుర్మార్గపు చర్యలను ప్రజలు తిప్పికొట్టాలన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో మతోన్మాద బీజేపీని ఓడించాలని పిలుపునిచ్చారు. పదేళ్లలో ఎంతో అభివృద్ధి చేశామని, సంక్షేమం అందిస్తున్నామని చెబుతున్నా ఇప్పటికీ దేశంలో అర్థాకలితో ప్రజలు అలమటిస్తున్నారన్నారు. మోదీ చర్యలన్నీ పురుషాధిక్యతకు అద్దం పడుతున్నాయన్నారు. అయోధ్యలో సీతాదేవి లేని రాముడి విగ్రహాన్ని మాత్రమే ఏర్పాటు చేశారని విమర్శించారు. భౌతిక వాదులైన కమ్యూనిస్టులు నిరంతరం ప్రజలకు అవసరమైన విధానాలపై పోరాడుతాయన్నారు. మతతత్వ రాజకీయాలకు దేశంలో చోటులేదని, సర్వమత సమ్మేళనమే భారతదేశమన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి మంద పవన్, జిల్లా కార్యవర్గ సభ్యులు మల్లేష్, లక్ష్మణ్, శంకర్, జిల్లా కౌన్సిల్ సభ్యులు రూపేష్, శ్రీనివాస్, రజిని, జనార్దన్, సుదర్శన్, రాజు తదితరులు పాల్గొన్నారు.

సేవలతోనే గౌరవం



మహిళా డిగ్రీ కళాశాలలో రక్తదానం చేస్తున్న సిబ్బంది

ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రసాద్

సిద్దిపేట ఎడ్యుకేషన్: సేవ ద్వారానే ప్రతి ఒక్కరికీ గుర్తింపు లభిస్తుందని ప్రభుత్వ డిగ్రీ కళాశాల (స్వయం ప్రతిపత్తి) ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రసాద్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల (స్వయం ప్రతిపత్తి) సిద్దిపేట ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వలంటీర్లు రక్తదానం చేయడం అభినందనీయమన్నారు. విద్యార్థులు సేవా తత్పరతను అలవార్చుకున్నప్పుడే ఉత్తమ పౌరులుగా గుర్తించబడతారన్నారు. 20 యూనిట్ల రక్తాన్ని సేకరించామన్నారు. ఉస్మానియా యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ నవీన్ సొదా ఆదేశాల మేరకు కళాశాలలో కార్యక్రమం జరిగిందన్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వాసం శ్రీనివాస్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు డాక్టర్ శ్రద్ధానందం, డాక్టర్ పల్లవి, డాక్టర్ మహేందర్, కృష్ణయ్య, స్థానిక మెడికల్ కళాశాల, ఆస్పత్రి సిబ్బంది మెడికల్ ఆఫీసర్ డాక్టర్ స్వాతి, జూనియర్ డాక్టర్లు ఉషశ్రీ, వినీత, ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా డిగ్రీ కళాశాలలోనూ

స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల సిద్దిపేట ఎన్ఎస్ఎస్, ప్రభుత్వ ఆస్పత్రి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఆస్పత్రి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ స్వాతి, సూపర్‌వైజర్ కనక చంద్రం, సిబ్బంది పాల్గొన్నారు. ఆ మేరకు సిబ్బంది, విద్యార్థినులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ సామ సువర్ణాదేవి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జీవన్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సీతారాములు, డాక్టర్ స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు చోట్ల ఇద్దరి ఆత్మహత్య

- పెళ్లి చేసుకోవడం ఇష్టం లేక ఒకరు.. అనారోగ్యంతో మరొకరు ..

పటాన్‌చెరు టౌన్: పెళ్లి చేసుకోవడం ఇష్టం లేక ఓ యువతి ఆత్మహత్య చేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన బీడీఎల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. హెడ్‌కానిస్టేబుల్ పాషా తెలిపిన వివరాల ప్రకారం.... రామచంద్రాపురం మండలం వెలిమెల తండాకు చెందిన విజయ(22) ఇంటర్ వరకు చదివి ఇంటి వద్దే ఉంటుంది. కుటుంబ సభ్యులు ఆమెకు పెళ్లి సంబంధాలు చూస్తున్నారు. సోమవారం తల్లిదండ్రులు ఇద్దరూ కూలి పనికి వెళ్లారు. ఇంట్లో ఒంటరిగా ఉన్న విజయ చున్నీతో దూలానికి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. సాయంత్రం వారు ఇంటికొచ్చి చూస్తే విగతజీవిగా కనిపించింది. తన కూతురుకు పెళ్లి సంబంధాలు చూడటం ఇష్టం లేదని దీంతో ఆత్మహత్య చేసుకుందని మంగళవారం తల్లి తులసి ఫిర్యాదు చేశారు.

జిన్నారం (పటాన్‌చెరు): అనారోగ్యంతో యువతి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన గుమ్మడిదల మండలం అన్నారంలో మంగళవారం జరిగింది. ఎస్ఐ మహేశ్వర్ రెడ్డి కథనం ప్రకారం జార్ఖండ్‌కు చెందిన రవీంద్ర శర్మ తన కుటుంబ సభ్యులతో కలిసి ఐదేళ్ల క్రితం అన్నారానికి వచ్చి నివాసం ఉంటున్నాడు. చిన్న కుమార్తె ఖుషీ కుమారి (21) కొన్ని రోజులుగా తరచూ ఫిట్స్ వస్తుండటంతో భరించలేక యువతి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్ కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. కేసు దర్యాప్తులో ఉంది.

చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి?

కొల్చారం(నర్సాపూర్): గుర్తుతెలియని శవం లభ్యమైన సంఘటన మండలంలో మంగళవారం చోటుచేసుకుంది. ఎస్ఐ మహమ్మద్ గౌస్ తెలిపిన వివరాల ప్రకారం.. ఏడుపాయల వనదుర్గాదేవి సన్నిధికి వెళ్తున్న భక్తులు.. పోతంశెట్టిపల్లి గ్రామశివారులో ఉన్న మంజీరా వాగులో మృతదేహం ఉందన్న సమాచారం అందించారు. ఘటన స్థలానికి వెళ్లి జాలర్ల సహాయంతో బయటకు తీశారు. చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు వాగులో పడి చనిపోయి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. చనిపోయిన వ్యక్తి వయసు 26-28 మధ్య ఉండొచ్చు. అతడి కుడి చేయిపై స్టార్ ఆకారంలో పచ్చబొట్టు ఉంది. బ్లూ కలర్ జీన్ పాయింట్, ఆరెంజ్ కలర్ ఫుల్ షర్ట్ ధరించి ఉన్నాడు. తెలిసిన వారు ఎవరైనా ఉంటే ఎస్ఐ కొల్చారం 87126-57919, మెదక్ రూరల్ సీఐ 87126-57916 నంబర్లలో సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

బైక్ అదుపు తప్పి వ్యక్తి ..



వెంకటేశం మృతదేహం

రామచంద్రాపురం (పటాన్‌చెరు): బైక్ అదుపు తప్పి కింద పడిన వ్యక్తి మృతిచెందిన సంఘటన రామచంద్రాపురంలో మంగళవారం ఆలస్యంగా వెలుగుచూసింది. పోలీసుల కథనం ప్రకారం.. స్నేహ లేక్‌వ్యూలో నివాసం ఉండే వెంకటేశం(56) వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కాగా సోమవారం తన స్కూటీపై లింగంపల్లి నుంచి పటాన్‌చెరుకు వెళ్తుండగా.. సీతార హోటల్ సమీపాన వాహనం అదుపు తప్పి కింద పడ్డాడు. దీంతో తలకు తీవ్ర గాయాలు కాగా చికిత్స నిమిత్తం ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఇక్కడ చికిత్సపొందుతూ మంగళవారం అతను మృతి చెందాడు. కేసు దర్యాప్తులో ఉంది.

గాయపడ్డ వ్యక్తి..



అంబ్రియ(ఫైల్)

కౌడిపల్లి(నర్సాపూర్): రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతిచెందాడు. ఎస్ఐ రంజిత్‌కుమార్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 14న మండలంలోని రాయిలాపూర్ పెట్రోల్‌బంక్ సమీపాన గల 765డి జాతీయ రహదారిపై జాజితండాకు చెందిన మాలోత్ అంబ్రియ తన టీవీఎస్ మోపెడ్‌పై వెళ్తుండగా.. ఎదురుగా వచ్చిన కారు ఢీకొనడంతో తీవ్ర గాయాలైన విషయం విదితమే. దీంతో హుటాహుటిన క్షతగాత్రుడిని గాంధీ ఆస్పత్రికి తరలించగా ఇక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. అతని భార్య శాంతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని ఎస్ఐ దర్యాప్తు చేస్తున్నారు.

యాప్‌లో కుష్టు బాధితుల వివరాలు

ప్రోగ్రాం అధికారి డాక్టర్ శ్రీదేవి



యాప్‌పై అవగాహన కల్పిస్తున్న శ్రీదేవి

సిద్దిపేటకమాన్: జిల్లా వ్యాప్తంగా కుష్టు బాధితులను గుర్తించి వెంటనే ఓరియంటేషన్, నిక్యూస్ట్ యాప్‌లో వారి వివరాలను నమోదు చేయాలని ప్రోగ్రాం అధికారి డాక్టర్ శ్రీదేవి అన్నారు. మంగళవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పని చేస్తున్న నోడల్ పర్సన్స్, డేటా ఎంట్రీ ఆపరేటర్లకు యాప్‌పై కలెక్టరేట్‌లో శిక్షణ కార్యక్రమాన్ని ఆమె నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, బాధితులను గుర్తించిన వెంటనే యాప్‌లో వివరాలను నమోదు చేయాలన్నారు. తద్వారా వ్యాధి నిర్మూలన చేపట్టేందుకు యాప్ ఎంతగానో దోహదం పడుతుందన్నారు. వివరాల మేరకు మందుల సరఫరా, నిల్వ ఉంచుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో శిక్షకులు రాష్ట్ర లెప్రసీ సొసైటీ సభ్యులు, కామేశ్వరరావు, నరసింహ స్వామి, డీపీఎంఓలు, ఎన్ఎల్ఈపీ, సిబ్బంది పాల్గొన్నారు.



ఆయిల్‌పామ్ మొక్కలను పరిశీలిస్తున్న సువర్ణ

సస్యరక్షణతో అధిక దిగుబడులు

నంగునూరు(సిద్దిపేట): ఆయిల్ పామ్ పంటలో సస్యరక్షణ చర్యలు తీసుకుంటే అధిక దిగుబడులు సాధించవచ్చని జిల్లా ఉద్యానవన, పట్టు పరిశ్రమల అధికారి సువర్ణ అన్నారు. మంగళవారం అక్కేనపల్లిలో ఆయిల్‌పామ్ తోటలను పరిశీలించి వేసవి కాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మొక్కల సంరక్షణ, మెలకువలు, యాజమాన్య పద్ధతులను రైతులకు ఆమె వివరించారు. అనంతరం మాట్లాడుతూ ఎండా కాలంలో మొక్కల మధ్య జీలుగ, జనుము విత్తనాలు వేసుకోవడం ద్వారా గాలిలో తేమ శాతం పెరుగుతుందన్నారు. ఇది మొక్క ఎదుగుదలకు దోహదం చేస్తుందన్నారు. నర్మేటలో ఫ్యాక్టరీ పనులు జరుగుతున్నాయని, రెండు నెలల్లో పంట చేతికొచ్చే అవకాశం ఉన్నందున ఎవరూ అధైర్యపడొద్దన్నారు.కార్యక్రమంలో అధికారులు, రైతులు పాల్గొన్నారు.

కుళ్లిన కోడిగుడ్ల పంపిణీ

బాలింతలు, గర్భిణుల ఆగ్రహం



కుళ్లిన గుడ్లు

అక్కన్నపేట(హుస్నాబాద్): మండలంలోని గోవర్ధనగిరిలోని అంగన్‌వాడీ కేంద్రంలో కుళ్లిపోయిన కోడిగుడ్లను బాలింతలు, గర్భిణులకు పంపిణీ చేసినట్లు గ్రామస్తులు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ రోజురోజుకు పౌష్టికాహారం కాస్త విషాహారంగా మారుతుందని వాపోయారు. ఈ నెల 5న అంగన్‌వాడీ కేంద్రాలకు కోడి గుడ్లు రాగా పంపిణీని ఆలస్యం చేశారన్నారు. ఇంటికి తీసుకెళ్లి ఉడక బెడితే కుళ్లిపోయిన వాసన వెదజల్లిందన్నారు. దాదాపు 10 రోజుల పాటు నిల్వ ఉంచి పంపిణీ చేశారని ఆరోపించారు. ఇలా చేయడం సరికాదన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలపై అధికారుల పర్యవేక్షణ లోపంతోనే ఇలా జరిగిందని దుయ్యబట్టారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు ఈ సమస్యపై దృష్టి సారించి నిర్లక్ష్యానికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కుటుంబ కలహాలతో సొంతింటికే నిప్పు

నారాయణరావుపేటలో ఘటన



మంటల్లో కాలిపోతున్న ఇల్లు

సిద్దిపేటరూరల్: కుటుంబ కలహాలతో సొంతింటికే నిప్పు పెట్టుకున్నారు. ఈ ఘటన నారాయణరావుపేటలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్ఐ అపూర్వరెడ్డి వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన పొన్నమేని నర్సింహులు తన భార్య రేణుకతో తరుచుగా గొడవ పడుతుంటాడు. ఆమెను శారీరకంగా, మానసికంగా వేధిస్తుంటాడు. సోమవారం రాత్రి 11 గంటల సమయంలో కూడా భార్యాపిల్లలతో గొడవ పడ్డాడు. కోపాద్రిక్తుడైన అతను పెట్రోల్ తీసుకొచ్చి ఇంటిపైనే పోసి నిప్పంటించారు. దీంతో ఇంట్లో ఉన్న సిలిండర్, ఫ్రిడ్జ్, విలువైన వస్తువులన్నీ కాలిబూడిదయ్యాయి. సుమారు రూ.5లక్షల వరకు నష్ట జరిగినట్లు కుటుంబీకులు తెలిపారు.

540 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ బాలస్వామి

- గడిపెద్దాపూర్ వద్ద పట్టివేత
- విలువ రూ. 10.80 లక్షలు
- నలుగురిపై కేసు నమోదు
- మెదక్ ఎస్పీ బాలస్వామి

అల్లాదుర్గం(మెదక్): రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తుండగా టాస్క్‌ఫోర్స్ సిబ్బంది రెక్కి నిర్వహించి పట్టుకున్నారు. మంగళవారం అల్లాదుర్గం పోలీస్ స్టేషన్‌లో ఎస్పీ డాక్టర్ బాలస్వామి విలేకర్ల సమావేశం నిర్వహించారు. నాలుగు వాహనాల్లో అక్రమంగా తరలిస్తున్న 540 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని అల్లాదుర్గం మండలం గడిపెద్దాపూర్ గ్రామం వద్ద పోలీసులు పట్టుకున్నారు. ఐచర్ వాహనంలో 106 క్వింటాళ్లు, డీసీఎం వ్యాన్‌లో 138 క్వింటాళ్లు, లారీలో 258 క్వింటాళ్లు, బొలెరోలో 40 క్వింటాళ్లు ఉన్నట్లు గుర్తించారు. నాలుగు వాహనాలను సీజ్ చేశారు. నలుగురు డ్రైవర్లు సాయి విక్రమ్, బస్వరాజ్, బాలయ్య, జయ్‌రాంలను అదుపులోకి తీసుకున్నారు. ఈ రేషన్ బియ్యం రైస్ మిల్లు యాజమానికి అమ్మడానికి తెచ్చినట్లు విచారణలో తెలిపారు. విలువ రూ.10.80 లక్షలు ఉంటుంది. అయితే రేషన్ బియ్యాన్ని తక్కువ ధరకు కొని అధిక ధరకు రైస్ మిల్లులకు అమ్ముతున్నారు. డబ్బు సంపాదనే ఉద్దేశంతో ఈ అక్రమ మార్గాన్ని ఎంచుకున్నారు. అయితే ఈ బియ్యాన్ని మెదక్ డీఎస్ఓకు అప్పగిస్తామని ఎస్పీ తెలిపారు. అక్రమ రవాణపై నిఘా పెట్టి కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో మెదక్ డీఎస్పీ రాజేశ్, సీఐ రేణుక, ఎస్ఐ ప్రవీణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.





నీటి కొలనులో ఈత కొడుతున్న పెద్దలు, చిన్నారులు

ఎండ నుంచి ఉపశమనం

ఎండ బారి నుంచి తప్పించుకునేందుకు నీటి కొలనులో దిగి చిన్నాపెద్ద తేడా లేకుండా ఈత కొడుతూ సేదతీరారు. చిన్నపిల్లలు ఎయిర్ రింగ్ ధరించి ఈత కొడుతూ చేసిన అల్లరి అందరినీ కట్టి పడేస్తుంది. అసలే అధిక ఉష్ణోగ్రత ధాటికి విలవిలాడుతూ ఇంట్లో నుంచి బయటికి రాలేకపోతున్నారు. ఈ తరుణంలో శరీరతాపాన్ని కొంతైన చల్లార్చేందుకు హుస్నాబాద్ మండలం మాలపల్లె సమీపంలో కొలనును ప్రజలు ఆశ్రయిస్తున్నారు. -హుస్నాబాద్